త్యాగం

హితులంతా గిండీ రేసెస్‌కి వెళ్లిపోయారు. అనంతం జేబులో పది రూపాయలకంటే ఎక్కువ లేదు. మొదటి తేదీ యింకా అయిదురోజుల దాకా రాదు. ఈ లోపల సిగరెట్లూ, కాఫీ వగైరా లన్నింటికీ నాన్న డబ్బు పంపే దాకా సరిపెట్టుకోవాలి. స్నేహబృందం పక్కన లేకపోవడంవల్ల అనంతానికి పిచ్చెక్కినట్టవుతోంది. నాలుగింటికి కాఫీ తాగి, సిగరెట్ ముట్టించి, మల్లెపువ్వులా తయారయి, ట్రిప్లికేన్ బస్ అందుకున్నాడు.

రూమ్‌మేట్స్ యింటికొచ్చే దాకా తను ఎలాగో అలా కాలంగడపాలి. మనసు సినిమా కెళ్లమని తొందరజేసింది. సినిమా ఆరుంబావుకుగాని మొదలెట్టరు. ప్రస్తుతం టైమ్ నాలుగుంబావు—మరి మధ్య రెండు గంటలో....ఆలోచించాడు. సినిమా టైము దాకా బీచిలో గడిపి -ఆపైన సినిమాకెళ్లి- స్నేహితులింటికొచ్చే వేళకి తనూ జేరుకోవచ్చు గదికి.

అనంతం *F. L.* క్లాస్ చదువుతున్నాడు. మరీ అందగాడు కాదు, అందవికారీ కాడు. సామాన్యంగా వుంటాడు మనిషి. కాని హృదయంమటుకు ఏవో గొప్ప ఆదర్శాలతో, ప్రపంచంమీద సానుభూతితో తొణికిసలాడుతూ వుంటుంది.

అమ్మా నాన్న దగ్గిర వుండి గుంటూరులో *B. A.* పూర్తిచేశాడు. తర్వాత ప్రపంచానికి న్యాయం కూర్చాలనే తాపత్రయంతో న్యాయవాదిచదువుకు దిగాడు. మొదటినుంచి పుష్కలంగా కాకపోయినా తన అవసరాలకి, విద్యకూ సరిపడే డబ్బున్న అనంతం దేశంలోని దారిద్ర్యం చూసి మహా విచారించేవాడు. తిండీ బట్టా లేని ప్రజలకు ఏదో తను సహాయం చెయ్యాలని ఆరాటపడేవాడు.

ఆ ఆరాటం పట్నం వచ్చాక మరీ ఎక్కువయింది. పేవ్‌మెంటుమీద వండుకుతిని జీవించే కుటుంబాలనీ, బస్‌స్టాండ్ల దగ్గిర అవిటివాళ్లని చూసి అతని హృదయం నిస్సహాయంగా ద్రవించేది. అందులో పట్నంలో వున్న వేలాది అన్నార్తుల్ని చూస్తే అతనికి వూపిరిసలిపేదికాదు. యవ్వనంలో తనకి ప్రతి వస్తువా ఏదో సుందరంగా, కొత్త రంగుల్తో కనబడుతూంటే వాటిమీద నీడల్లా యీ బీదా బిక్కీ అతన్ని వెన్నాడుతూండేవి. వేడిరక్తం లేమిని తరిమెయ్యాలని రకరకాల ఆలోచనలకి పోయేది.

అలా అని అతను సినిమాలకీ, హోటళ్లకీ వెళ్లకుండా ప్రతికానీ బీదసాదలకి యిస్తున్నాడని అనుకోడం తెలివితక్కువ. కాఫీ హోటలుకెళ్లి—బయటకొచ్చి, కిళ్ళీనమిలి, సిగరెట్ ముట్టిస్తూండే వేళకి 'అయ్యా' అని చేజాపే దరిద్రులకి కానీ గాక అణా వేడ యిస్తూండే వాడు. అదే అతను చేసే ఘనకార్యం. అతని దయాదాక్షిణ్యాలు కానినుంచి బేడదాకా పెరిగాయి. దారిపక్కన దొర్లే బిచ్చగాణ్ణి సంస్కరిద్దామని వుండేది.

కాని ఎలా? ఏ విధంగా? మహానాయకులకే మార్గాలు తెలియనపుడు *F. L.* చదివే విద్యార్థికా?

బస్సెక్కి బీచిలో దిగాడు అనంతం. బీచంతా రంగు రంగుల చీరెల్తో తళుక్కున మెరుస్తోంది. బెలూనులు గాల్లో ఎగురుతున్నాయి. రేడియో సరిగమల్ని చెవుల్లోకి పంపుచేస్తోంది. వేరుగల్లు వాళ్లు ఒకటే కేకలు. అనంతం పాంట్ జేబులో చేతులుంచుకుని ఫుట్‌పాత్ మీద నెమ్మదిగా అన్యమనస్కంగా నడుస్తున్నాడు.

నాలు గడుగులు వేశాక అతని కళ్లు దేనిమీదో క్షణం నిలిచాయి. దూరాన, అంటే మరీ దూరంగా కాదు, యిరవై గజాల దూరంలో ఒకమ్మాయి అలా సముద్రం వైపు చూస్తూ నుల్చుంది. ఆమె దృష్టి దేనిమీదా నిల్చి లేదు. జీవితపు శూన్యంలోనుంచి సముద్రపు శూన్యంలోకి చూస్తున్నట్లు వుంది.

ఆ అమ్మాయి అక్కడినుంచి కదిలి ఆ పక్కనే వున్న గారడి గుంపులో కలిసిపోయింది. అనంతం ఎందుకో అలా ఆ అమ్మాయిని వెంటాడుతూ గుంపుదగ్గిరకు జేరుకున్నాడు. ఈ సారి ఆ అమ్మాయి పది గజాలకంటె ఎక్కువ దూరంలో లేదు. అనంతం స్పష్టంగా ఆ అమ్మాయి ముఖాన్ని చూడగలిగాడు. ముఖంలో ఆకర్షణ లేదు సరిగదా, యవ్వనంలో కనిపించవలసిన అందం గూడా లేదు. ఒక విధంగా అందవిహీన అని చెప్పవచ్చు. నల్లని ముఖం, చిన్నకళ్లు, పెద్ద నోరు, ముక్కు అదిమినట్టుగా వుంది. పురుషుల్ని ఆకర్షించే ఏ కాస్త అందమూ లేని ముఖం చూస్తే అనంతానికి ఆసక్తి కల్గింది-ఆసక్తి కాదు జాలి కలిగింది.

కంపెనీ చీర కాస్త మాసినట్టుగా వుంది. గట్టిగా బిగించి వేసిన జడకి చివర్న పసుపుపచ్చని మురికి రిబ్బను చూస్తే అనంతానికి చిరునవ్వు వొచ్చింది. చేతులో వెలిసిపోయిన పువ్వుల గొడుగు. గొడుగుపిడి విరిగిపోయింది. దానికి తాడు గట్టి గర్వంగా చేతులో పుచ్చుకుంది. వెలిసిన ఎర్ర జాకెట్టు మీద సూర్యరశ్మి పడడంవల్ల బూడిద రంగుగా కనిపించింది.

ఆ అమ్మాయి గుంపును వదిలి కిందికి చూస్తూ నడుస్తోంది. అనంతానికి ఆ పిల్ల మీద అపారమైన జాలిపుట్టుకొచ్చింది.

పాపం! యిరవై యిరవై రెండేళ్ల వయస్సులో గూడా ఏ పురుషహృదయాన్ని ఆకర్షించ లేకపోయి వుంటుంది. ఆ సాయంత్రం, స్త్రీ పురుషులు ఒకర్నొకరు రాచుకుంటూ, నవ్వుకుంటూ తిరిగే బీచిలో అనంతానికి, తనూ-ఆ అమ్మాయి-వారిద్దరే అలా ఏకాంతతతో తిరుగుతున్నట్టు అనిపించింది.

అతని హృదయంలో అణిగి మణిగి వున్న అహంభావం-ఆ పిల్లకి ఆ సాయంత్రం ఏదో ఆనందాన్ని చేకూర్చాలని నిశ్చయించుకుంది. తనలాటి విద్యావంతుడూ రూపసీ ఒక సాయింత్రం ఆమెకు వ్యక్తిత్వాన్ని యిచ్చి ఆదరించడం ఆ అమ్మాయి జీవితంలో మరుపురాని ఘట్టం అవదూ? సహారా ఎడారిలాంటి ఆమె జీవితంలో యీ సాయింత్రం ఒక ఒయాసిస్సు అవగల ఆనందంతను కూర్చాలి-అనుకుంటూ పెద్ద పెద్ద

అంగల్లో ఆ అమ్మాయి పక్క కెళ్లి "నమస్తే" అన్నాడు అనంతం.

'ఆ' అంటూ తెల్లపోయి అతని వంక చూసింది ఆ పిల్ల.

'నమస్తే' అన్నాడు తిరిగి.

"యారు మీరు?" అంటూ తిరిగి నమస్కారం చెయ్యకుండా సూటిగా ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలోని యాసకి అనంతం నవ్వుకున్నాడు. బహుశా ఏ కలవారింట్లో నో పని మనిషేమో!-

"నేను- అనంతాన్ని బి. ఏ. పాస్ అయాను. మీరు వొంటిగా-" అంటూ నశిగాడు.

ఆ అమ్మాయి మాట్లాడకుండా నడక సాగించింది.

"మీతో ఎవరూ లేనట్టున్నారు. నేనూ ఒక్కడినే. అలా తిరిగి, కాంటెన్‌లో కాఫీ తాగి, ఖబుర్లాడుకుందాం."

అమ్మాయి ఖంగారుగా అతని వంక చూసి తడబడుతూ "కాఫీకి నా దగ్గిర దుడ్డుయిల్లె- నేను రాను మీరు సాపడండి" అంది తల వంచుకు.

"మనిద్దరి కాఫీకి సరిపడ దుడ్డు నా దగ్గిర వుంది. రండి వెళ్దాం. లేకపోతే ఆ మూల కూచుందాం. కాసేపుండి కాఫీ తాగొచ్చు."

"మీకు పణం నిండా వుందా? నా దగ్గిర దుడ్డు లేదు. నన్ను కాఫీకి యారు ఎన్నడూ కూపడలేదు" అంది ఆశ్చర్యంగా.

"నేను పిలుస్తున్నాగా-రావూ" అన్నాడు మళ్ళీ అనంతం.

ఆ అమ్మాయి వెనక్కి తిరిగింది. బొడ్లోంచి నీలపు చేతిరుమాలుతీసి, ముఖం తుడుచుకుని నడుస్తో 'నన్ను యారు ఎప్ప కాఫికి కూపడల' అంది నెమ్మదిగా మళ్ళీ.

"నీ పేరు?"

"షణ్ముగం"

"ఏంజేస్తున్నావ్? పెండ్లయిందా?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

"కల్యాణం అవలేదు. తిరువత్తూర్ ఫాక్టరీలో వేల చేస్తున్నాను. రెండు వారాలకో తూరి దుడ్డు పుచ్చుకు పట్నంవచ్చి మళ్ళీ ఏడుమణికి తిరువత్తూర్ పూడుస్తాను" అంది.

"ప్రతి శని ఆదివారాలూ ఫాక్టరీకి శెలవ యివ్వరూ?" అని ప్రశ్నించాడు.

"లీవు యిస్తారు కాని పట్నం రావడానికి దుడ్డు ఆపడదు. అందుకు మాసానికి రెండుతూరి మూడుమణికి వచ్చి—ఏడుమణికి మళ్ళీ పూడుస్తా" అంది షణ్ముగం.

ఇద్దరూ మెరినా కాంటిన్ దగ్గిర కొచ్చారు. సాయంకాలపు నీరెండ సముద్రంలో ప్రతి బింబిస్తోంది. ఇందాకటికంటే బీచిలో జన సందోహం ఎక్కువయింది. కాంటిన్‌లో రకరకాల మనుషులు. ముఖ్యంగా పట్టుచీరెలు—విలువైన సూట్లు. యివ్వన్నీ అనంతంకంటిని పడ్డాయి. ఎరుగున్న వాళ్లు కనపడతారేమో నన్న ఆదుర్దా కలిగింది అనంతానికి, గబుక్కున, తన స్నేహితులెవరన్నా, యీ బీదపిల్ల పక్కన, మెళ్ళో పూసలు కట్టుకున్న నల్ల పిల్ల పక్కన, తనను చూస్తే ఎంత అవమానం. నలుపక్కలా కలియజూశాడు— ఎవరూ ఎరుగున్న వాళ్లు కనపడలేదు.

షణ్ముగాన్ని వెంటతీసుకొని ఒక పక్కగా వున్న టేబుల్ దగ్గిర కూలబడ్డాడు హోటల్లో అందరికళ్లూ తనమీదే వున్నట్టుగా వుంది. ముచ్చెమటలు పోశాయి. నుల్చుని జేబులోంచి రుమాలు తీసుకోబోతున్నాడు. దూరాన అవతలకొసని శకుంతలా మాధవీ యిద్దరూ కూచుని వుండటం చూశాడు. అనంతం కాళ్లు వొణకడం మొదలుపెట్టాయి. వెయిటర్ వచ్చి టేబుల్ దగ్గిర నుల్చుని వున్నాడు.

"ఏంతింటావ్" అన్నాడు నెమ్మదిగా అనంతం.

"కాఫియేగా. అవల దుడ్డు లేదుగా" అంది షణ్ముగం గట్టిగా. వెయిటర్ వెకిలిగా నవ్వుతున్నాడు. అనంతానికి వాణ్ణి పట్టుకు తన్నాలని అనిపించింది. "రెండు ఐస్ క్రీమ్—చిప్స్" అన్నాడు విసురుగా వెయిటర్ వంక చూస్తూ. వాడు నిర్లక్ష్యంగా నవ్వి వెళ్లిపోయాడు.

అనంతానికి ముళ్లమీదున్నట్టుంది. దూరాన వున్న మాధవీ శకుంతలా ఎక్కడ చూస్తారో అని ఖంగారుగావుంది. షణ్ముగం



నిర్భయంగా, వాతావరణంలోని మార్పుల్ని గమనించనట్టు, పరిసరాల్లోని ధనాఢ్యుల్ని చూడనట్టు, హాయిగా కూచుంది. ఈ పట్టు చీరెలు, ఫాషన్లూ ఆ అమ్మాయిని అంటడం లేదా? లేక వాటి విలువ తెలియదా?

"నన్నెవరూ ఎప్పు కాఫీకి పిలవ లేదు" అంటోంది తిరిగి షణ్ముగం. గొంతు పిసకాలనిపించింది. అనంతానికి. ఎప్పుడూ ఎవరూ పిలవకపోతేనేం? యివ్వాళ తను పిల్చాడుగా! నోరుమూసుకు కూచోరాదు! వెధవది లేనిపోనిది తెచ్చుకున్నాడు. మాధవీ శకుంతలా తనవైపే చూస్తున్నారు.— అదుగో నవ్వుకుంటున్నారు.

రేపు మాధవి క్లాసులో తలెత్తి చూస్తుందా? అనంతం కామన్ గరల్స్‌తో తిరుగుతున్నాడని శకుంతల నలుగురితో అనక మానుతుందా? తన గౌరవం, మాధవి మీద తన ఆశలు, ముందు ఈ నల్లపిల్లను వదుల్చుకుంటే...

వెయిటర్ విర్లక్ష్యంగా చప్పుడుతో టేబుల్ మీద ఐస్ క్రీమ్ వగైరా పెట్టాడు. "వధవకి, వీడికెందుకు ఆ హేళన—ఎవర్ని తెస్తే ఏం, డబ్బివ్వడం లేదూ, వెధవ ఎగిరి పాటూ వీడూనూ—" "కాఫీ—బిల్లు" అన్నాడు విసురుగా అనంతం.

షణ్ముగం ఐస్ క్రీమ్ నోట్లో పెట్టుకుని "ఇంత జిల్లునుంది. నేనెప్పో సాపడలేదు" అంది వుత్సాహంగా. ఆ మాటలనేటప్పటి కళ్లలోని తృప్తి, కొత్త వెలుగూ చూశాక అనంతాని క్కాస్తకోపం చల్లారింది. మాధవీ శకుంతలల కళ్లలో ఆ కృతజ్ఞతా, తృప్తీ తనులక్షలిచ్చయినా తెప్పించగలడా?



సోల్ ఏజంట్లు; యునైటెడ్ కన్‌సరన్, 54 బందరు వీధి, మద్రాస్, బెజవాడడిపో: సూర్యారావుపేట.

"మరోకప్పు తింటావా?" అన్నాడు దయగా.

"పల్లు పూడుస్తుంది-వాణా" అంది షణ్ముగం.

"కాఫీ యింకోకప్పు?" అన్నాడు మళ్లీ.

"వద్దు" అంది తలవూపుతూ.

"మళ్లీ ఎప్పుడో స్టావ్ యిక్కడికి?" అని ప్రశ్నించాడు.

"రెండోవారం పోనాక అంటే వొంబాదాం తేదిన మూడుం కొలుకి వస్తా-నాలు మణిదాక బస్సువద్దే నుల్చుకుంటా, మీరు వస్తారుగా" అంది నును సిగ్గుతో.

తను యిందాకటినుంచీ చూడని అందం ఆమె చెక్కిళ్లమీద కనపడింది అనంతానికి. "అల్లాగే, బస్సుదగ్గర ఎందుకు? యివ్వాళ టకి మల్లే నడుస్తాండు-కలుసుకుంటా" అన్నాడు చిప్స్ కొరుకుతూ.

వెయిటర్ కాఫీ తేవడంతో తలెత్తాడు. మళ్లీ శకుంతలా మాధవీలు-చుట్టూ సిల్కు చీరెలు, సూట్లూ మధ్య షణ్ముగం తనూ మాధవీ శకుంతలలు ఏవేవో గుసగుసలు చెప్పుకుంటున్నారు.

మళ్లీ తేళ్లూ జెర్రులూ పాకినట్టయింది. "అయిందా పోదాం. నువ్వింక వెళ్లు. నాకు పనుంది" అన్నాడు విసుగ్గా షణ్ముగంతో.

"ఇప్పుడు మణి అంజేగా-ఆరు మణిదాకా నాకు పనిలేదు" అంది షణ్ముగం.

"నాకు పని వుంది. నువ్వింక వెళ్లిపో." అన్నాడు లేని కాఠిన్యాన్ని కంఠంలోకి తెస్తూ.

షణ్ముగం రాళ్లని కరిగించేలా చూస్తూ "వొంబాదాం తేదీన నాలుమణికి కట్టాయం వస్తారా?" అంది దీనంగా.

ఆ కళ్లలోకి చూస్తుంటే షణ్ముగం వెంట వెళ్లి సాయంత్రందాకా వుండి, ఆ అమ్మాయిని బస్సెక్కించాలని అనిపించింది. కాని దూరానవున్న మాధవి గులాబీ జార్జెట్ చీరె శకుంతల నైల్ పాలిష్, టేబుల్ మీద వారి ప్లాస్టిక్ బాగ్‌లు అన్నీ అతన్ని వెనక్కి లాగాయి.

"అల్లాగే" అన్నాడు కటువుగా.

"కట్టాయం" అంది బెరుగ్గా.

"కట్టాయం" అన్నాడు మృదువుగా.

షణ్ముగం వొంటిగా దీనంగా వంగిన బుజాలతో నిర్జీవంగా నడిచి వెళ్లిపోయింది.

నుదుటిమీద చిరుచెమటల్ని రుమాలుతో తుడుచుకుంటూ, మాధవీ శకుంతలల టేబుల్ వైపు నడిచి 'హల్లో' అన్నాడు హుషారుగా అనంతం. శకుంతల 'హల్లో' అంది తిరుగా నవ్వుతూ. మాధవి తను ఆ పక్క లేనట్టూ, తనకూ ఆ వచ్చిన మనిషికీ సంబంధం లేనట్టూ మొహం తిప్పుకుంది.

'అనుకున్నంతా అయింది' అని మనస్సులో అనుకుంటూ కుర్చీమీద కూలబడ్డాడు. అనంతం.

శకుంతల యీమాటా, ఆమాటా మాట్లాడింది. మాధవిని పలకరిద్దామని ప్రయత్నించి ఆమెదగ్గరనుంచి సమాధానం రాక, వోడిపోయిన యోధుడిలా ముఖం పెట్టి కూచున్నాడు అనంతం.

"ఆ అమ్మాయి ఎవరూ?" అని గబుక్కున ప్రశ్నించింది మాధవి.

ఏం సమాధానం యివ్వాలో తెలీక, తికమకపడ్తున్న అనంతాన్ని సూటిగా చూస్తూ "మీ చెల్లెలా?" అంది మళ్లా మాధవి.

అనంతానికి మాధవిమీద అసహ్యం వేసింది. ఎంతయినా ఆ కూలిపిల్లను పట్టుకు 'నీ చెల్లెలా' అని అడుగుతుందా? తనంత లేనివాడనుకుందా? ఎంత చదువుకున్నా, ఎంతఅందమైనదైనా తననీవిధంగా మాటల్తో అవమాన పర్చక్కర్లేదు! 'అవును' అని అందామనుకున్నాడు. కాని యీ దెబ్బతో మాధవితో తెగతెంపులు చేసుకోవలసి వస్తుందని తమాయించుకుని "కాదు. బీచిలో కలుసుకున్నాను- ఎప్పుడో చిన్నప్పుడు తెలుసున్నమ్మాయి" అన్నాడు తడబడుతూ.

మాధవీ శకుంతలలకి తను షణ్ముగాన్ని ఏ పరిస్థితుల్లో పిల్చిందీ చెపితే అర్థం అవుతుందా? తను *impulsive* గా చేసింది వాళ్లకి బోధ పడుతుందా? తనది చంచల హృదయం కాదంటే మాధవినమ్ముతుందా? ఒకవేళ అనీ విని తనను వెర్రివెంగళప్ప కింద కడితే? తన మనస్తత్వాన్ని అర్థం చేసుకునే శక్తి మాధవికి వున్నదా? అయినా యిది సమయం కాదని, ప్రశ్నార్థకంగా చూసే ఆమె చూపుని తప్పించుకున్నాడు. అయితే మాధవి వూరుకుంటుందా? లేడి కళ్లతో అనంతం వంక తిరిగి "మళ్లీ వస్తుందా" అని అడిగింది.

అబద్ధాలకి అలవడని అనంతం సమాధానం వల్ల పడే చిక్కుల్ని వూహించక "తొమ్మిదో తేదీ శనివారం యీ వేళకే వస్తుంది" అని చెప్పాడు.

తను తెలుసుకోవలసిన విషయాలు పూర్తి అయినట్టు మాధవి శకుంతల వంకజూసి కళ్లెగరేసింది. ముగ్గురూ లేచారు. అనంతం బిల్లు చెల్లించాడు. "*Good-bye*" అన్నారు ఏకకంఠంతో అందచందాల అబలలు.

* * *

"ఇంత వెకిలివాడని అనుకోలేదు." అంది మాధవి.

"అంటే?" అంది శకుంతల.

"ప్రతి అలగా జాతిపిల్లతో పోయేవాడని తెలుస్తే యింత దూరం అతనితో స్నేహం చేసి వుండకపోదును. ఛీ...ఆ పచ్చరిబ్బన్నూ అదీనూ-దానిలో ఏ అందం చూశాడో" అంది మాధవి.

"అతను చెప్పినట్టు చిన్నప్పటి ఏ పని వాళ్లపిల్లో అయివుండచ్చు. దానికింత రాద్ధాంతం ఎందుకు?"

"అది కాదు. మళ్లీ అది శనివారం వోస్తుందట చెప్పాడుగా. పని పిల్ల అయితే యివ్వాళతో నే పోను. అతని మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నా. ఇంక రేపటినుంచి అతని ముఖం చూడను." అంది మాధవి నిష్కర్షగా.

"ఒక్క మాట చెప్తా విను. అనంతంలో నీకు యింతవరకు ఏ లోపాలూ కనపడలేదు అవునా?"

"ఊఁ..."

"ఈ ఒక్కటి అంటావా, దీని అంతూ వంతూ తేల్చుకుందాం. ఏదో తొందరబడి అతనితో తెగ తెంపులు చేసుకోడం బాగుండదు. మీ రొమాన్సు కాలేజీ అంతా తెలుసాయెను. మీవాళ్లకు కూడా చూచాయగా తెలుసు. అందువల్ల కొస్త ఆలోచించి పని చేయడం మంచిది"

"ఏంపని?"

"నే చెప్పినట్టు చెయ్యి. రేపటినుంచి కాలేజీలో, బయటా అతనితో ముభావనగా వుండు. సాధ్యమైనంతవరకూ తప్పించుకు తిరుగు. అతన్ని క్రీగంట చూస్తూ, అతను నిన్ను చూడనట్టు నటించి—అంటె అతను చూస్తున్నప్పుడే—బాధగా భారంగా నిట్టూర్పులు విడు. నువ్వు మాట్లాడనందుకు కారణాలు అడిగేందుకు నిన్ను కలుసుగో చూస్తాడు కాని ఒంటరిగా మటుకు చిక్కకు. కాలేజీలో నేనెప్పుడూ నీ పక్కనే వుంటాను. యికి యింటిదగ్గిర అవకాశం యివ్వకు. వుత్తరాలు రాసినా ఎరగనట్టు వూరుకో"

"ఆపైన?"

"చెప్పేది విను. తొమ్మిదో తేదీ శనివారం ఆ పిల్ల వస్తుందని చెప్పాడా? శుక్రవారం సాయింత్రం అతనిదగ్గిరకెళ్లి శనివారం 'టీ'కి రమ్మనమని పిలువు. సరిగా మూడింటికని పిలు. అతని కళ్లలోకి దీనంగా 'రాను అని అనేందుకు వీల్లేకుండా' చూడు. సమాధానానికి ఎదురు చూడకుండా భారంగా వచ్చేయి. అప్పుడు తెలుస్తుంది అతని సత్తువ, అతనిమీద నీహక్కు ఎంతవరకు వుందో."

"ఎట్లా?"

"ఎట్లాగేమిటి! 'టీ'కి నీతో వచ్చాడంటే ఆ పిల్లను కలుసుకోడన్నమాట. అంటే నువ్వు ఆ అమ్మాయికంటే ఎక్కువన్నమాట. యిదే పరీక్ష. ఇందులో నువ్వు నెగ్గితే, అనంతం నీవాడు. నువ్వు వోడిపోయావా అతన్ని వొదిలేయవచ్చు—అంతేగాని యిప్పుడు తొందరబడకు. తెలిసిందా?" అంది శకుంతల మహాయుక్తిపరురాలులా.

మాధవి తల వూపింది.

* * * *

మాధవిని కలుసుకుని ఆనాటి పరిస్థితులు విడమర్చి చెపుదామని అనంతం శాయశక్తులా ప్రయత్నించాడు. శకుంతల సలహా తూచి తప్పకుండా పాటిస్తున్న మాధవి అనంతానికి అందలేదు. అతని వుత్తరాలు బుట్టదాఖలా అయాయి. మాధవి తనవల్ల చాలా బాధపడుతోందని గ్రహించాడు. ఆమెను వోదార్చి, లాలించాలని అనుకున్నాడు కాని...

శుక్రవారం మాధవి శకుంతలలు గేటు దగ్గిర తచ్చాడుతూ అనంతానికి కనపడ్డారు. ఇన్నాళ్లు మాధవికోసం తను కాసుకవుండేటంగాని, మాధవి తనకోసం వుండలేదు. బహుశా తన వుత్తరాలు పని చేశాయేమో ఆమె కోపం పోయిందేమో!

మాధవి తనవైపుగా వచ్చి దీనంగా ముఖం పెట్టి "రేపు మూడింటికి మాయింటికి 'టీ'కి రండి-మీతో మాట్లాడాలి" అంది నేలను చూస్తు.

మాధవి రాజీలోకి దిగుతోందా? "నిరభ్యంతరంగా వస్తా" అని అతి సంతోషంతో అనబోయాడు కాని వెంటనే షణ్ముగం జ్ఞాపకం వచ్చింది. పాపం! తనకోసం బీచి దగ్గిర కాసుకుని వుంటుంది. పోనీ ఎల్లుండి మాధవి యింటికెళ్తే? రాలేనని అంటే?

మాధవి తలెత్తి అతనివంక చూసింది. నీలి మబ్బులవంటి ఆవిడ కళ్ళు తననికట్టేశాయి. నుదుటిమీద స్వేదబిందువులు అతని హృదయాన్ని కదిపేశాయి. పాపం! పిచ్చి మాధవి తనకోసం బాధపడ్తోంది-రానని ఎలా అనడం?

"ఊఁ" అన్నాడు.

మారు మాటాడకుండా వెళ్లిపోయింది మాధవి.

* * *

మర్నాడు టీ, తాగాక మాధవి 'అలా తిరిగివద్దాం' అంది అనంతం శకుంతలలతో.

అనంతానికి నిన్న సాయింత్రం మాధవి మీద వున్న జాలి యీ సాయింత్రానికి సగం తగ్గింది. నిన్న మాధవి నిస్సహాయంగా కనపడిందిగాని, యివాళ ఏదో గర్వంగా ప్రవర్తిస్తున్నట్టనిపించింది అతనికి. చక్కగా నేర్పుగా సింగారించుకున్న మాధవివెనక లీలగా షణ్ముగం మాటి మాటికి అనంతానికి జ్ఞాపకం వస్తోంది. అతని హృదయం షణ్ముగాన్ని కలుసుకోలేకపోయినందుకు కలవరపడసాగింది.

ముగ్గురూ లేచారు. ట్రిప్లికేన్ బస్ ఆగింది. 'ఎక్కుదాం' అంది మాధవి. శకుంతల రెండడుగులు వేసింది. అనంతం ఎవరో ఆపినట్టు ఆగిపోయాడు. మళ్లీ కాంటీన్‌కా? అక్కడికి కావాలని ప్రయాణం చేయిస్తోందా మాధవి?

నిన్నటినుంచీ కలగని అనుమానం క్షణంలో మెరిసింది. కాని వెనక్కి తగ్గడం యిప్పుడు అసాలోచితం.

ముగ్గురూ బస్సు దిగారు. కాసేపు యిటూ అటూ తిరిగాక, మాధవి కాంటీన్ వైపు అడుగు వేస్తూ "మీ యిద్దరికీ నేను పార్టీ యిస్తా" అంది వోరగా నవ్వుతూ. అనంతం అనుమానాలు దృఢమయాయి.

ముగ్గురూ మధ్య టేబుల్ దగ్గిర కూచున్నారు. మాధవి ఏవేవో లిస్టు చెబుతోంది. అనంతానికి ఏమీ వినపడటం లేదు. శకుంతల దేనికోసమో వెతుకుతున్నట్టు చూస్తోంది.

ఐస్‌క్రీమ్ తింటూ ముగ్గురూ మాట్లాడుకుంటున్నారు. అనంతానికి షణ్ముగం 'జిల్లుమంది' అనటం జ్ఞాపకం వచ్చింది. 'పాపం' అనుకున్నాడు.

మాధవి తలెత్తి "అదిగో మీ ఫ్రెండు" అంది అనంతాన్ని వుద్దేశించి.

దూరాన షణ్ముగం వుత్సాహంగా తన వైపు వస్తోంది. అనంతం లేవలేదు. అలా చూస్తూ కూచున్నాడు. పది అడుగులు ముందుకువచ్చి ఆగిపోయింది షణ్ముగం. ఆ ముఖంలో నవ్వు లేదు. శూన్యంలోకి చూస్తున్నట్లు కూచున్నాడు అనంతం.

మరో నాలుగడుగులు ముందుకువచ్చి అతనివంక తేరిపార చూసింది. ఆ కళ్లలో దెబ్బతిన్న లేడికళ్ళలోని బాధ వ్యక్తమ

దరిశి వీరరాఘవస్వామిగారి

రచనలు

శ్రీ రామభక్తులు } (పద్యసంపు
లోకబాంధవులు } టములు)

తరుణోపాయము: శ్రీరామసంకీర్తనములు

వివరములకు :

గ్రంథకర్త: శ్రీ వాసుదేవసదనం,

అరండల్ పేట, గుంటూరు.

యింది. గుండెల్లో ముల్లు గుచ్చుకుంది. అనంతం అలాగే చూస్తూ కూచున్నాడు.

షణ్ముగం గిర్రున తిరిగి నెమ్మదిగా దూరానికి వెళ్ళిపోయింది. మాధవీ శకుంతలలూ షణ్ముగం వేసుకున్న పచ్చరిబ్బను చూసి బిగ్గరగా మరీ బిగ్గరగా నవ్వుతున్నారు. తళుకు బెళుకుల నాగరికత మానవ హృదయాన్ని చూసి వికృతంగా నవ్వే నవ్వు అది.

ఆనాటినుంచి మాధవిమీద ఒకవిధమైన అసహ్యం కలిగింది అనంతానికి. నీలాల వంటి ఆ కళ్ళలోకి చూసినప్పుడు దెబ్బతిన్న షణ్ముగంకళ్లు జ్ఞాపకం వచ్చేవి. మాధవిని ప్రేమిద్దామని ప్రయత్నించాడు. కాని వారిద్దరిమధ్యా షణ్ముగం భంగపాటు అడ్డమొచ్చింది.

ఆనాటినుంచి మాధవినే కాదు, ఏ స్త్రీ కళ్ళలోకి ప్రేమతో చూడబోయినా, షణ్ముగంచూపు వెంటాడేది అనంతాన్ని. అంతే అతను ఏ స్త్రీనీ ప్రేమించలేకపోయాడు. ఆ సాయంత్రం తను అనాలోచితంగా జాలిపడి అలా ఎందుకు ప్రవర్తించానా—అని ఎప్పుడూ విచారిస్తూనే వుంటాడు. ఆ సాయంత్రపు దుర్బలత్వాన్ని నిందించుకోని రోజు లేదు అతని జీవితంలో. ★

చీమలు - పాములు

(10-వ పేజీ తరువాయి)

సూర : అలాంటి మాట్లనకండి. ఉండండి. ఎందుకేనా పనికొస్తాయి చేకావు. అదుగో మీవారు వొస్తున్నారు నే పోతాను.

రామ్మూర్తి పంతులు : ఏమిటే? నువ్వు పురాణం నరసమ్మగారి దగ్గిర ఆ రూపాయలు దాచుకోడ మేమిటే?

సీతా : ఏం లేదు.

రామ్మూ : నాకంతా తెలిసిందిలే.

సీతా :...మూట్లెల్ల కిందట నేను అక్కడా అక్కడా దాచిన నాలుగు రూపాయలూ ఆవేళే గోనెసంచు లమ్మి ఓరెండు రూపాయలూ దాచమనిస్తే లేదనేస్తాండండీ. నాఖర్మ!

రామ్మూ : ఖర్మమిటి? చేతులారా చేసుకుని! ఇంట్లో వుంటే ఏమయ్యేయి జెప్పూ, చెడిపోతాయనా చెదపడతాయనా వాళ్ళకిచ్చేవు?

సీతా : నాకు జ్ఞాపకం లేదు పొమ్మంటోంది! అక్కడికి సూరమ్మగారూ రంగమ్మగారూ కదిపి చూసేరుట సుమండీ!

రామ్మూ : ఏడవ లేకపోయినారు! దొంగతనంగా నాకు తెలీకుండా ఏదో దాచేద్దాం ఊడపొడిచేద్దాం అనుకున్నావు! తగిన శాస్తయింది!

సీతా : బాగుంది. నేనేనా తినేద్దామనీ బట్టగొందామనీ నగలు చేయించుకోవాలనీ దాచలేదు. పిల్లలకోసమే!

రామ్మూ : నగలు! నగలుకావొద్దూ! పిల్లలకోసమేంట! దుబారా ఖర్చుకోసమన రాదూ! అదెవరక్కడ? నరసమ్మగార్లా వుంది!

నర : అవునండీ నేనే. ఇలా రండి సీతారామమ్మ గారూ!

రామ్మూ : మీరే రండి లాగ!

నర : ఇందాకఅడిగేరు చూసేరూఅమ్మ-నాకు బొత్తిగా జ్ఞాపకం లేకగాని ఉంటే వెంటనే యిచ్చేద్దునమ్మ. ఇప్పుడు మా ఆచార్లుగారొచ్చేరు. ఆ యన్నడిగేను శ్రావణమాసంలో మీ కేమే నా పద్దుందేమో చూడమని. ఆయన తీసి చూస్తే ఆవేళ సాయంకాలం నేను చెప్పేనుట ఆ రూపాయలు మీరిచ్చినట్టు. పుస్తకంలో రాసినా, అవుసరానికి మీ కివ్వాలి గదా అని ఆరూపాయలే, ఆ రెండ్రూపాయల నోటే పొట్లాం కట్టి సందుగుపెట్టి అడుగరలో పడేశార్ట. ఇదుగో చూసుకోండి.

సీతా : ఎంత బావుందమ్మ - ఇదుగో, ఆ వేరూపాయలూ అదే నోటున్నూ!

నర : మరేం అనుకోకండమ్మ. నే పోతాను. సొమ్ము జాగర్త. ఇచ్చిసేనుడీసుమం!

సీతా : అలాగే అలాగే.

రామ్మూ : ఇలా తే.

సీతా : అబ్బ! ఏం బాగా వుందీ!

రామ్మూ : మరి తమాషా చెయ్యక ఇలా తే. కావాలి.

సీతా : నాకూ కావాలి.

రామ్మూ : కావాలన్నప్పుడిలా యిచ్చేయి. అంతే.

సీతా : అదేమిటండీ ఆదమాయింపూ?

రామ్మూ : దమాయింపేమిటి ఇలా యియ్యి ముండర. నువ్వు పెట్టినా ఆకర్చే నేను పెట్టినా ఆకర్చేగద!

సీతా : అదే బావుంది. ఇంతా కష్టపడి నేను జాగర్త చేస్తే...

రామ్మూ : ఓ! మహా కష్టపడ్డావు. దొంగలెఖ్ఖలు వేసి దొంగబాకీలు అప్ప జెప్పినీ!

సీతా : అలా ఎవరూ చెప్పలేదు.

రామ్మూ : గోనెసంచు లమ్మడం బాగానే వుంది. మరి వాట్ని తెచ్చింది నేనేగద!

సీతా : అయితేమాత్రం? వొంటిమీది బంగారంమీదేగదా అని తీసి ఖర్చుపెట్టేస్తారా యేమిటి?

రామ్మూ : బంగారం వేరు, డబ్బు వేరు.

సీతా : వేరే, పాపం!

రామ్మూ : నీతో నాకు వాద నెందుకు! తే యిలాగ!

సీతా : తీసుకోండి అంతకోపం అయితే.

రామ్మూ : అలాగే తీసుకుంటాన్లే... ఆ చేతులో ఆ అయిదురూపాయల నోటేమిటి?

సీతా : అది వేరు.

రామ్మూ : ఆ వేరేమిటీ అంట! నువ్విలా ప్రతీదానికీ వేలుమీద గోరు మొలిచిందంటూ వుంటే యెలాగ?

సీతా : అంత వేరు కాదు. నరసమ్మగారు 'ఇవ్వరనుకొని నేను యిదవుతూ వుంటే సూరమ్మగారు పట్టుకొచ్చిచ్చేరు.

రామ్మూ : ఇవి ఆవిడదగ్గిర దాచిన బాపతన్నమాట!

సీతా : దాచడ మెక్కడ? అప్పిచ్చింది. మళ్లా వున్నప్పుడిచ్చేమంది.

రామ్మూ : ఈ టక్కులు నాకు తెలీకపోవు. తేతే యిలాగ!

సీతా : అదే బావుంది. ప్రతీదీ తేతే అంటూను!

రామ్మూ : నీలాగ వేషాలు వేసేవాళ్లదగ్గిర యిలాగే వుండాలి.

సీతా : వేషా లేమిటండీ! కావలిస్తే ఆవిణ్ణి పిలుస్తా నడగండీ!

రామ్మూ : మీ రందరూ తోడిదొంగలే న్లే. అంతా ముందే బందోబస్తు చేసుకుని నాటకాలాడతారు. ముందా సొమ్మిలా యిచ్చి. ఖర్చుకి చాలవు నా దగ్గిరివి.

సీతా : అవే చాల్తాయి. ఇవి మాత్రం యివ్వను. ఆవిడ కివ్వాలి!

రామ్మూర్తి : ఆఁ ఆఁ యివ్వాలి! ఇస్తావా ప్రయాణం మానుకుంటావా చెప్పు!

సీతా : అదే బావుందండీ! ఆవిడదగ్గిర పిల్లలకేమేనా కొందామనీ మనవడి చేతిలో పెడదామనీ అప్పుదెస్తే ఈ తీసుకోడం బావుంది.

రామ్మూ : బావుంటుంది బావుంటుంది. ఇలా ఇచ్చేయ్ ఆ సొమ్ము.

సీతా : మరీ పెళుసుబారిపోతోందీ. ఏదో సామిత చెప్పినట్టు!

రామ్మూ : ఇస్తావా యియ్యవా? ★

కాంతి పబ్లికేషన్స్, రాజమండ్రి,

మెట్రికువిద్యార్థులకొరకుఇండియన్ హిస్టరీ బ్రిటిష్ హిస్టరీ, సివిక్సు, జాగ్రఫీ ప్రశ్నోత్తరాలు అచ్చులో నున్నవి. ప్రతి 1-కి 0-8-0 వాణీ కాలేజీ తయారు. "కాంతి" వైజ్ఞానిక మాసపత్రిక కోసం ఎదురుచూడండి. సంవత్సరచందా 2-12-0. విడిప్రతి 0-4 0.